కథానిక

# ఎదురుచూడని మార్పు

"శ్రీవిరించి"

ప్రతి సహజంగా తెల్లవారింది. కామాక్షమ్మ మామూలుగా లేచి, పనిలో నిమగ్న అయింది. 'అప్పుడే తెల్లవారిందా?' అని బద్ధకస్తులు కళ్లునులుముకుంటున్నారు. 'తెల్లవారింది మనకు కొంత స్వేచ్ఛ' అనుకునే జీవులూ, పదార్థాలూ సంతోషతరంగాలలో వూగుతున్నాయి. ఎవరి పనులు వారు చూచుకో మొదలెట్టారు.

ఆ రోజు కాంతానికి మాత్రం విడ్డూరంగా వుంది. అతను మామూలుగా రోజూ తెల్లవారక ముందే లేచి-పనులన్నీ కానిచ్చుకుని ఆఫీసుకు తొందరగా వెళ్ళేవాడు. ఇవాళ ఎనిమిదింటికిగాని లేవలేదు. భర్తతో పాటుగానే లేచి, సవరింపులు చేసుకునే లలితగూడా అందుకనుగుణంగా వేళ మార్చింది. కాంతానికి, ఆ స్థలాన్నీ మనుషుల్నీ, ఆ కాలానికి చూడడం అలవాటు లేనందువల్ల విడ్డూరంగానే వుంది. కామాక్షమ్మ యీ మార్పంతా గమనించినట్లు లేదు. ఇక స్నానానికి ప్రయత్నాలు జరుపుతూన్న ఆవిడకు కాంతం కనిపించాడు. 'ఇదేమిట్రా, ఇవాళ ఇంకా ఇంట్లోనే వున్నావు ఏమిటీ విడ్డూరం?' అందావిడ కొద్దిగా ఆశ్చర్యపడుతోనే. కాంతం చిరునవ్వుతో, సన్నగా యేదో అన్నాడు. కాని ఆ మాటలు అతని పెదిమలు దాటి-ఓ అంగుళం మేరేనా వచ్చి వచ్చివుండవు. లలితమాత్రం భర్త కెదురుగుండా నిల్చి అత్తగారితో 'వుద్యోగం మారింది, యీ రోజునించీ' అంది. కామాక్షమ్మ ఆనందం ఇనుమడించింది. ఇప్పటికి, కాంతం సందేహపు దొంతరల్లోంచి ఇవతల పడుతూ, 'అవునమ్మా నా వుద్యోగం మారింది. ఆ ఆఫీసులో మారి ఇంకో ఆఫీసులో చేరాను' అన్నాడు. కామాక్షమ్మకు కావాల్సినన్ని ప్రశ్నలు ఎదురు తగిలినై. ఇదివరకు వుద్యోగం కావాలంటే చాలా తిప్పలమీదగాని దొరకలేదే, అంతటి వుద్యోగాన్ని ఎట్లా వదులుకొన్నాడా అనీ; తరువాత ఓ వుద్యోగం మారిపోయిం తర్వాత ఇంత త్వరగా మళ్ళీ ఇంకో వుద్యోగం ఎట్లా దొరికిందా అనీ! ఇవన్నీ అర్థంగాక, "నాకేమీ తెలియటంలేదు. సరిగా విడమర్చి చెప్పరా-" అంది, కొడుకును. కాంతం చెప్పాడు. అయినా ఆవిడకు కొన్ని అనుమానాలుమిగిలేపోయాయి.

"అవుతే యీ వుద్యోగంలో జీతం ఎక్కువా?"

"లేదు. ఓ అయిదు తక్కువే-"అన్నాడు నెత్తిగోక్కుంటూ, యీ సంగతి ఇంతకన్నా బాగా చెప్పటం ఎట్లానో తెలియక.

"కాకపోతే, ఏమయినా పనితక్కువా?"

"కాక?" అన్నాడు కాంతం విజయగర్వంతో. "పదింటినించీ మూడింటి వరకూ. ఆదివారం సెలవు. సంవత్సరం అంతటికీ పాతిక సెలవులు వాడుకోవచ్చు" అని తన వుద్యోగపు షరతులన్నీ చెప్పి ఆవిడ నుక్కిరిబిక్కిరి చేశాడు.

అంతా విన్నాక, ఆవిడ మళ్ళీ మొదటికొచ్చింది.

"అవుతే, అవుద్యోగం ఎట్లాపోయింది? వాళ్ళతో నేం పేచీలుగాని..."

"ఎబ్బెబ్బే- ఏమీలేదు. ఆ కంపెనీ దివాలయింది. దాన్లో పనిచేసేవారందరికీ, కొత్తగా పెట్టిన మరో కంపెనీలో మళ్ళీ వుద్యోగాలు చూపించారు. నాకిది దొరికింది. అయిదు రూపాయిలు తక్కువయినా, కొద్దిగా విశ్రాంతిగా వుంటుంది గదా అని, వొప్పుకున్నాను" అన్నాడు సర్ది చెప్పే ధోరణిలో.

కామాక్షమ్మకు కొడుకు వుద్యోగం మార్పు విషయం సందేహాలన్నీ తీరినట్టే.

ఈ మార్పుకు కామాక్షమ్మా లలితా గూడా సంతోషించారు ఎంతోగా.

కొడుకు తమను పోషించటానికి, ఇంత శ్రమ పడుతూ, తీరిక బొత్తిగా లేకుండా వుండటం, ఆవిడకేమీ సబబుగా కనిపించలేదు.

లలిత కాపురానికొచ్చిన యీ మూడేళ్ళ లోనూ, భర్తను కనిపెట్టుకూర్చొనటానికి నోచుకోలేదు యేవో తప్పనిసరి సెలవలూ, రాత్రిళ్లూ మినహాయిస్తే.

కాంతం వుద్యోగంమీదనే ఆధారపడి వున్న వాడు గాబట్టీ, లలిత ఉచితానుచితాలు ఎరిగినపిల్లే గనకా, సరిపెట్టుకూర్చుంది. ప్రపంచంలో సుఖపడేవాళ్ళంతా, ఆపిల్ల కళ్ళముందు కూర్చుంటున్నట్టవుతుంది. ఆ జాబితాలో తనూ చేరబోతోందని అంతకుముందు అనుకున్న లలిత, కాపురానికి వచ్చింతర్వాత, నీరసించింది. పగలంతా, బల్లమీది కాగితాల కట్టల దొంతరల ముందు కూరుకుపోయి, శ్రమకుదగ్గ పారితోషికొన్ని పొందలేని కాంతాన్ని చూస్తే లలిత గర్వపడాల్సివుంటుంది తనకు జాలివున్నందుకు. ఇలా దైవికంగా మార్పొచ్చి పడుతుందనీ, భర్త తనకు మరీదగ్గరై, సుఖపడటాన్ని గురించి ఆలోచించటానికి కాలందొరుకుతుందనీ, ఆ యిద్దరిలో ఎవరూ అనుకోలేదు. కాని వొచ్చింది. అందుకు సంతోషించారు.

ఎన్నడూ అర్ధణా, అణా తప్ప డబ్బంటే యేమో యెరగని కుర్రవాడికి వొక్కసారిగా, రూపాయి యిస్తే ఎట్లా కర్చుచెయ్యాలో అర్థంగాక తికమకపడే విధంగా కాంతం బాధ పడ్డాడు. రోజుల్లో, పట్టపగలు కొన్నిగంటలు తను యింటగడపాల్సి వచ్చిది ఇపుడు. అందుకు మొదట మొదట సంతోషించినా, క్రమేపీ అనుభవంలోనికి వచ్చిన తర్వాత అది కంటకప్రాయమే అయింది. కాకపోతే అతనికి పెళ్లాంతో సరస సల్లాపాలు ఆడటం చేతగాదనటానికి వీల్లేదు, లలితకు కూడావీలున్నప్పుడల్లా వొచ్చి భర్త దగ్గర కూర్చుని కబుర్లాడాలని వుండేది. కామాక్షమ్మ యేమంటుందోనన్న భయం వుండేది. క్రమంగా దాన్నించీ విడివడి, ముచ్చటలు సాగించేది. అనుకున్న విధంగా కామాక్షమ్మ అడ్డగించలేదు. పైగా ప్రోత్సహించిందేమో గూడా.

లలిత చెప్పేమాటలు కాంతానికి అర్థం అయ్యేవిగావుకొన్నికొన్ని. ఆపిల్ల ముఖ్యంగా యిరుగు పొరుగు వాళ్ళ కబుర్లు తప్ప మరేవీ చెప్పేదిగాదు. ఈకబుర్లు విన్నకొద్దీ నిశ్చయంగా కాంతానికి విసుగే ఎక్కువయింది. కాకపోతే యేమిటీ ఆడ సొద?

* * *

కాంతం ఆఫీసు మెట్లు దిగేసరికి మూడు గంటలుదాటి, అయిదు నిముషాలేనా కాలేదు. రోడ్డుమీదికి వచ్చింతర్వాత 'ఎటు పోవాలి?' అన్న చిక్కు ప్రశ్న వచ్చింది. ఇప్పుడింటికి పోయి యేమిటి చెయ్యటం?

ఈ ఆఫీసులోపని తక్కువచాలా. ఒక్కొక్క రోజు రెండున్నరన్నా కాక ముందే యింటికి వెళ్ళాల్సిన అగత్యం వస్తోంది. ఆలోచిస్తూన్న కాంతానికి, వెనకటి రోజులు గురుతొచ్చాయి. ఆఫీసు కుర్చీనించి లేద్దామంటే, ఎంతకూ వీలు చిక్కేదిగాదు. ఎవరెవరో వచ్చి, ఏవేవో కాగితాలిచ్చిపోయేవారు. ఎన్నో కాగితాలు తన చేతిమీదిగా గడిచిపోయేవి. అప్పుడు విసుక్కునేవాడు, ఏమిటీ పనని! 'క్షణం తీరికలేదురా, చస్తున్నా' నని కనబడ్డవాళ్ళతోనల్లా చెప్పేవాడు. ఇపుడు కనిపిస్తూన్న కాలాన్ని సరిగా వినియోగించుకో లేకపోతున్నాడు. సరైన శిక్షణ మనసుకు యివ్వలేక పోతున్నానని బాధ పడుతున్నాడు. పరిస్థితుల కనుగుణంగా, మనసు మార్చుకోగల నేర్పు అలవరచుకుందామనుకుని ఎన్నోసార్లు ప్రయత్నించీగూడా విజయం పొందలేకపోయాడు. 'కలిగీ కర్మం, లేక దరిద్రం' అన్న సామెత తనలాటి వాళ్ళకు బాగా అతుకుతుంది. తీరుబాటు కొంతసేపూ కావడంలేదనీ, ఒక్క ఆఫీసు వ్యవహారాలేగాని యితర వ్యాసంగాలు కలిగించుకో వీలు కలగటంలేదనీ; కొద్ది తీరుబడి కలిగినా, ఇతర వ్యాసంగాలు కలిగించుకోవడంలో వెగటూ, ఏదో తెలియని మానసిక బాధా, కొద్ది కాలాన్ని గూడా వినియోగించుకోలేనందుకు, విలాపం!

బ్రతుకుతూన్న తనలాంటి వాళ్ళంతా యేం చేస్తున్నారు తీరిక సమయాల్లో? కొందరి కసలు చెప్పుకోదగ్గ పనేవీ కనిపించదే, పోనీ అలాంటి వాళ్లతో ఎవరితోనన్నా స్నేహంచేస్తే బాగుణ్ణు,

తనకు తీరుబడిగావున్న ప్పుడు వెట్టుకు రావచ్చు. కాని యిదిఅసంభవం. సంభవమే అయితే, లలిత చెప్పే కబుర్లు అంత వెగటు కలిగించవు.

నడుస్తోన్న కాంతం కళ్ళకు వోపుస్తకాల షాపు కనిపించింది. అవును! పుస్తకాలు! ఎన్నో పుస్తకాలు! రకరకాలవి దొరుకుతాయ్ యిక్కడ. కాంతానికి తీరని సమస్యగా పరిణమించపోయే యీవిషయానికి ఒకజవాబు దొరికి నట్లయింది. చాలా మెకానికల్ గా, అతను షాపులో ప్రవేశించాడు. "ఏం కావాలండీ?" అని ఓపెద్దమనిషిఅడిగిన ప్రశ్నకు, ఏం జవాబు ఇవ్వాల్సిందీ తొందరగా తోచక, "యేవేనా పుస్తకాలు" అని బలవంతాన అన్నాడు. ఓ పది పదిహేను పుస్తకాలు ముందుకు వచ్చాయి. వాటిలో రెండు యేరుకుని బిల్లు చెల్లించి ఇవతలపడ్డాడు. వాటిని చూసుకుంటూ యిల్లుచేరే సరికి నాలుగయింది. కాంతం సరాసరి కాళీగా వున్న యీజీ చైర్ లో కూర్చుని "చదవటం" ప్రారంభించాడు. లలిత అతనికి కాఫీ తెచ్చిచ్చి, అతను తాగుతోన్నంత సేపట్లో యీ రెండు పుస్తకాలూ చూసింది, వాటి పేర్లూ అదీ. "ఎక్కడివండీ?" కొన్నానన్నాడు, అనవసరమైన ఖర్చని లలిత అంటుందేమోనని భయపడు తోనే. "కొన్నారా?..." అని ఆగిపోయింది.

"ఏం?"

"ఏమీలేదు కావాలంటే నేను తెచ్చి ఇచ్చేదాన్నిగదా, ఇట్లాంటివి అని–"

"ఎక్కణ్ణించీ?"

"పక్కింటమ్మాయ్ నిర్మల కిల్లాంటి పుస్తకాలు చదవటం చాలా సరదా. ఆవిడ దగ్గిర యెన్నో వున్నాయి.

"అట్లానా? నువ్వూ చదివావా?"

"కొన్ని చదివాను. ఇదిగో, వీటిలో ఒకటి చదివాను ఇదివరకు" అంది.

"ఆహా" ఆశ్చర్యాన్నే నటించాడు కాంత!

* * *

కాంతం లలితా భోజనాలు చేశాకగాని ఎనిమిది గంట లవలేదు. లలిత చీల్చియిస్తున్న తమలపాకులు నములుతూ కాంతం, అప్పుడే రంగంలో ప్రవేశించిన చంద్రుణ్ణి చూచి వూహా ప్రపంచంలోంచి, భయపడి ఇవతల పడ్డాడు.

అతనింతవరకూ ఆలోచిస్తోన్నది లలితని గూర్చి. ఈ పుస్తకాల్లో కావల్సినంత అవినీతి, మనుషుల్ని చెడగొట్టే దురభిప్రాయాలు వ్రాసి వున్నై. ఎంతో తెలివితేటలు వుంటేగాని వాటి బారినించీ తప్పించుకొనటం కష్టం. బుద్ధికుశలతా నిగ్రహశక్తీ చాలా కావాలి! ఎవరు చెప్పగలరు? "బుద్ధిః కర్మానుసారిణీ" కామా? తన ఆలోచనలు చంద్రుడికి తెలిశాయేమోనని భయపడ్డాడు.

"ఏమిటండీ ఆలోచిస్తున్నారు?–"

"ఏమీలేదు–"

"చెబుదురూ–"

"కొత్త సినిమాలు..." సినిమా! తప్పకుండాను.

పుస్తకాలంటే కాంతానికి విసుగే పుట్టింది. చాలాకాలంగా అలవాటుపడ్డ పనిమానేసి, అంత అభిరుచిలేని మరొకటి చేయటం కష్టమే మరి!

"అమ్మా– సినిమాకు వెడదామా?" అన్నాడు కాంతం.

కామాక్షమ్మ ఆశ్చర్యపడ్డది. "నేను సినిమాకేమిట్రా? మీరిద్దరూ వెళ్ళిరండి. ఇంట్లో వుంటా నేను."

"ఇంట్లో ఎవరూ వుండక్కర్లేదులే. భయం లేదు. సినిమా బాగుందట, రా."

ఈసారి ఆవిడ ఇష్టపడలేదు. కాంతం మరి బలవంతం చెయ్యలేదు.

లలిత, కాంతం, సినిమానించి వచ్చేసరికి వొంటిగంటయింది. ఇద్దరికీ వుబ్బుసబ్బులుగా వుండి నిద్దరోయారు. అయినా మరునాడు, పొద్దున్నే తొందరగా లేచారు ఇద్దరూనూ.

కామాక్షమ్మ లేచింతర్వాత, కాంతం కనిపించకపోయేసరికి, అదేమని కోడలి నడిగింది.

లలిత తలొంచుకుని, "మళ్లీ మామూలు వుద్యోగమే అయింది" అంది.

"అదేం?" అదరిపడ్డది కామాక్షమ్మ.

"ఆకంపెనీ మళ్లీ తలెత్తిందిట!"

కామాక్షమ్మ మరేమీ మాట్లాడలేదు.

కాంతం మళ్లీ మామూలు మనిషయ్యాడు. అతని ఆలోచనలు అంతరించినై. మధ్యలో యీ "అర్థంలేని మార్పు" ఎందుకు వచ్చిందో లలితకూ, కాంతానికీ గూడా అర్థంగాలేదు.